ఐదు నిముషాలు

హిందీమూలం :
"వియోగిజీ"

అనువాదం :
శ్రీ వి. యస్. రామమూర్తి

గడచిపోయింది! ఐదు నిముషాల కాలమూ-యిట్టే గడచిపోయింది! జైలు కమ్ములకవతల సతమతమౌతూ మా వారు, యివతల పోలీసుల పహరాతో బిక్కుబిక్కుమంటూ నేను; - కడపటి సారిగా కలుసుకోవడాని కనుమతింపబడిన ఐదునిముషాలు ఇట్టే గడచిపోయినై!

◆ ◆ ◆

గడచిపోయిన సంఘటనల్ని జ్ఞప్తికి దెచ్చుకోవడంలో లాభమేముందీ? - శూలాల్లాగ హృదయాన్ని చీల్చి వేయడం కంటె అవి చేయగల మహోపకారమేదీ లేదు. నా బాధల్ని యితరులకు చెప్పుకొందామన్నా మనస్ఫూర్తిగా విని, సానుభూతి చూపగలిగిన సహృదయులేరీ? అథవా విన్నా "చెల్లీ, మనమేం జేస్తాం నీవదుక్కొచ్చిందింతే నమ్మా, నీకా భగవంతుడేదిక్కు" అంటారేకాని.

భగవంతుడట - భగవంతుడు ఎవరా భగవంతుడు? ఎక్కడున్నాడా భగవంతుడు? పీడితులగు అభాగ్యుల నెన్నడైనా రక్షించాడా, - విపత్సముద్రములో మునిగి సర్వనాశనమగువారికెవరికైన చేయూత నిచ్చాడా? అన్నార్తులకు పట్టెడన్నము పెట్టగలిగాడా? దుఃఖితుల కన్నీరు దుడువవలెనన్న భావమైనగలదా ఆ భగవంతునకు? ఊహూఁ - మచ్చుకైనా లేదు. స్వర్గంలోని నందనవనంలో కేళీవిహారాలు సల్పుతున్న అతనికి తీరికేది? భగవంతుడుగూడ చిన్న భార్య చేతి కీలుబొమ్మనేమో? చిన్నమ్మ గారి చూపెవరిపైనుంటుందో వారే అతనికి సన్నిహితులుగాని నావంటి దరిద్రురాలలెక్కేమిటి? దురదృష్టమే దరిద్రుల యిలవేల్పు. పెద్దమ్మ ముద్దు బిడ్డనగు నేను లక్ష్మీలోలుడగు భగవంతుని వేడుకోవడమెందుకూ? నిర్భాగ్య దేవాలా ప్రార్థనమే నా కర్తవ్యము. ఆశ్రితవాత్సల్య ప్రకటనమునందామె కామెయేసాటి. శరణన్నదే తడవుగా యిట్టే దర్శనమిచ్చి, మరోకొండంత యాపదను నెత్తిపైబెట్టి, వికటంగా నవ్వుకొంటూ చల్లగా జారుకొంటుందా మహాతల్లి!

ఒక్కమారా చల్లని తల్లిని తలచుకొన్నంతనే పట్టభద్రుడు, బీదవాడు, నిరుద్యోగియగు వానికి నన్నంటగట్టి చంకలెగురవేసికొంది; రెండవమారు తలచినదే తడవుగా యిద్దరు బిడ్డల తల్లినై కూర్చున్నా, మూడవమారు తలచుకొన్నానో లేదో - నా జీవనసర్వస్వము, నా ప్రాణనాథుడు ఖూనీనేరం క్రింద జైలుకెళ్లాడు - మరణదండన విధింపబడ్డది. అంతే, అంతా

పూర్తియై పోయింది. యింక నెందు కామెను పిలవడం ?...

బీదరికమే అన్ని అపరాధములకు మూలమైతే అతనికి మరణదండనమే విధించండి, గుండుపెట్టి కాల్పించండి, చీల్చి కాకులకు గ్రద్దలకు పడవేయండి. కాని శాస్త్ర నామాటవినండి – అతడు ఖూనీకోర్ కాదు, బీదవాడుమాత్రమే; అపరాధిగాదు, ఆకలి గొన్నవాడు; ఆపదలలో జిక్కియుండెనే గాని హత్యజేయలేదు; అన్నార్తుడేగాని యీయన పాపిమాత్రముకాదు.

ఇంతకూ ఆయన జేసిందేమిటి? ఎట్టి మహాపాపమున కొడిగట్టారాయన? లేదే- ఆయన ఏయపరాధము జేయలేదే? తన కడుపుకోసం, తన యాలు బిడ్డలకోసం తిండికై ప్రయత్నించాడు. దురదృష్టం యీ శాస్త్ర ప్రయత్నాన్నే "ఖూనీ" యన్నది. అందుకు సిద్ధంగా కాచుక కూర్చొన్న చట్టము యీమాత్రానికే నిర్దాక్షిణ్యంగా మరణదండన విధించింది. కానీ పరవాలేదు – నిస్సంకోచంగా చెప్తున్నా – ఫరవాలేదు; అతడు చని పోనీ, ఉరికంబమునుండి వ్రేలాడనీ – కానీ నాకేమోసంతోషమే. ఎందుకంటారా? అతడు నిరపరాధి! ఒకసారిగాదు. నూరు సార్లు, వేయిసార్లు చెప్పగలను – అతడు పాపిగాదు; దరిద్రుడు, అభాగ్యుడు, అన్నార్తుడు-అయినా అతడూమనుష్యుడే- అతనిలోను మానవత్వం ఉంది.

నిజమే, – అతడాకలిబాధకు సహించ లేక దుర్జనసహవాసంచేశాడు. దొంగి లించాడు, మోసంజేశాడు, దారులుగాచి దోపిడీచేశాడు; యిన్నీ చేసినా కడుపు కొఱకే. నైతికదృష్టితో జూస్తే అతడు అపరాధి, పాపి, దోపిడి దొంగ, ఖూనీకోర్ కాని శాస్త్రయోచించండి – నైతికశాస నాల్ని బీదవాళ్లే అనుసరించాలా? సాంఘిక నియమాలు, ధార్మికశాసనాలు నిర్భాగ్యుల కొఱకేపుట్టేయా? ? బీదరైతులకు అప్పు లిచ్చి, తుదకు అసలు ఫాయదాలకై వారి భూమిబుట్రల నాక్రమించి వారిని నిరాశ్ర యులుగా జేయుచున్నాడే 'రామ్‌ధర్ తేలీ' మహాశయుడు – అతని చక్రవడ్డీ రేటు ప్రభావమా అని వందలకొద్దీ కుటుంబములు దిక్కులేక అల్లోలత్కృశాయని అలమటించు చున్నవే – అతని చల్లని చూపుతోనే శ్మశానాలైన పండంటి కాపురాలకు లెక్కే లేదే – యిది పాపంగాదూ? యిదియప రాధంగాదూ? ఆకలి దీర్చుకొనుటకు ప్రయత్నించిన నా భర్తదా అపరాధము? మాట్లాడరేం – ఉరితీయండి – అతన్ని ప్రపంచంనుండి వేరుజేయండి – ఈ చర్యతోనే పాపంనశిస్తుందా? ప్రపంచంలో అపరాధముయొక్క నామరూపాలే లేక పోతవా? మరి పాపమన్నదే ఉండక

పోతుందా భూమ్మీద? ...... కాదు. అట్లెన్నటికిని జరుగదు.

౨

ప్రభుత్వమువారి యొద్దనుండి నిన్ననే నాకో ఉత్తరం వచ్చింది. నా భర్తనాతో కడసారిగా మాట్లాడదలచాడట - కడపటి సారి. ఎల్లుండే అతన్ని ఉరితీస్తారు. చనిపోయేముందు - కడపటిసారిగా తన భార్యా బిడ్డలను జూడవలెననీ; వారితో మాట్లాడి సెలవుపుచ్చుకోవలెనని యిష్టపడ్డాడు. నా ప్రాణేశ్వరుని యిచ్ఛానుసారము తుదిసారి వారి దర్శనమునకై బయలుదేరితిని. నేనవరినైతే చూడబోవుచున్నానో వారిపై మృత్యుదేవత తన చల్లని చేతులుంచుటకెదురు చూచుచున్నదనియు, వారిమెడలో దగిలించుటకై ఏర్పాటైన యురిత్రాడు ఊగిసలాడుచున్నదనియు, వారిశవమున కప్పుటకై నూతన వస్త్రము తయారుగానున్నదనియు నాకు బాగా తెలుసు - కాని ఆయన యిప్పుడు మనమధ్య, మనవలెనే బ్రతికి యున్నాడు - ఎంతటియాశ్చర్యమైన విషయము!

మీరే యోచించండి మీకత్యంత ప్రియుడగు వ్యక్తి మృత్యువు చేజిక్కినాడనుకొనుడు. అతనిని జూడ్డానికిమీరు బయలుదేరి వెళ్లుతారు. ఎవరినైతే మీరీ దినం చూచుచున్నారో, అతడే రేపు ఉరిత్రాటి నుండి గిలగిల తన్నుకొని చనిపోతాడు. అతని శవము మీ వద్దకు చేర్చబడుతుందని యనుకోండి. అప్పటి మీ పరిస్థితి నూహించుకొని నావ్యథనర్థముజేసికొనుటకు ప్రయత్నించండి. దుఃఖభారంతో నేను చట్టాన్ని ధిక్కరించడంలేదు. న్యాయాన్ని నిందించడంలేదు. నా దుఃఖాన్ని వ్యక్తం జేసికొంటున్నానంతే. మనుష్యులతో గాదు, వారియందణగియున్న మానవత్వంతో నాగోడుజెప్పుకొంటాను. "చెప్పూ, సోదరీ! మానవత్వమా! నీవైన చెప్పుము. న్యాయము మూగది, గ్రుడ్డిది, చెవిటిది- దానికి హృదయంలేదు. అది అందరినీ ఒకే విధంగా విచారించి తీర్పుజెబుతుంది. కాని నీలో "మంచి" ఉంది. ఈ శాసనాలు, ధర్మసూత్రాలు దాన్ని అణగద్రొక్కలేవు. చెప్పూ, నాదైన్యమును న్యాయము ముందు నీవైనవివరించు!"

ఎట్లో యాంత్రికంగా వారివద్దకు బయలుదేరాను. ఎన్నెన్నో యోచనలతో నడువసాగాను.-ఆఁ, ఒక్కసారి వారి పాదాలకు చుట్టుకొంటాను, వారి వక్షస్థలంలో తల దాచుకొని తనివిదీర నా బాధను వెళ్లబోసికొంటాను. "నన్ననాథను జేసి పోతున్నారా, నాకై స్వర్గంలో కాచియుండండి, - యీదీనురాల్ని మరచిపోరుకదూ......? పాపిష్టిదాన్ని, మీ పాలపొంగులాంటి యౌవనంలో విషంచిలికించి మంటగలి

పాను. మీయభివృద్ధికి సర్వవిధముల అడ్డు తగుల్తూవచ్చాను... అవన్నీ మరచి నన్ను క్షమించరూ? ఇదిగో మా బిడ్డడు. వీణ్ణిదగ్గరకు తీసికోండి. ఒక్కసారి.... ఆఖరుసారి పితృవాత్సల్యము నీతనిపై వర్షించండి.'' అల్లకల్లోలంగా ఉన్న మనస్సును అదుపులో పెట్టుకోలేక ఎట్లెట్లో జైలుదారి వెంబడి కాళ్ళీడ్చుకొంటూ నడుస్తున్నా. వెంటనడుస్తున్న గోపీనాచేతిని తన రెండు చేతులలోకి తీసికొని, ''అమ్మా, మనమెక్కడికి పోతున్నాము''అని యడిగాడు. ఏమని జవాబిచ్చేది? ఏ విధంగా వివరించేదా పసిబిడ్డకు? తుదకెట్లో గుండె రాయి జేసికొని, ''గోపీ, మీ నాన్నగారిని చూడ్డాని కెళ్తున్నామమ్మా; వారికి నిన్ను చూడవలెనని యున్నదట'' అని చెప్పాను.

ఈ జవాబుతో గోపీ చాల సంతోష పడ్డాడు. ''ఏమ్మా – నాన్న చాల రోజుల్నుండి మనింటకే రాలేదే! నాన్న చాల మంచివాడుగదమ్మా, మరేం-యీ సారి ... నాకు మాంచి బొమ్మలు కొని పెట్టమని నాన్నను అడుగుతాను. ఆ బొమ్మల్లో చెల్లాయికి ఒక్కటిగూడ యివ్వను. నాన్న మా నాన్నే. చెల్లాయి నాన్నకాదు. నాన్న తెచ్చే బొమ్మలన్నీ నాకే గదమ్మా'' – గోపీ అమాయకత్వం నా హృదయాన్ని ఛిన్నాభిన్నం చేయ సాగింది. పిచ్చితండ్రి! నాన్నగారు మృత్యు దేవత కౌగిలిలో కూర్చొని, నిముషములు లెక్కించుకొంటున్నాడని వాడికేం తెలుసు! అసలు జైల్లో ఉన్నాడనికూడ తెలియదాయె. తుదకెట్లో నిగ్రహించుకొని, ''బాబూ! దేవుడే మనకిక దిక్కు'' అని మాత్రం అనగలిగాను.

''ఎప్పుడొస్తాడమ్మా! నాన్న? ఎప్పుడో ఎందుకూ - ఇప్పుడే నాతోనే పిల్చుకొచ్చేస్తా. నాన్నే–...నా కోసం–అచ్చం జయగోవిందు దగ్గరున్నట్టిదే–చిన్న సైకిలు తెస్తారు. చూడమ్మా, వాడు నన్ను తన సైకిలును తాకనన్నా తాకనీడు. విరిగి పోతుందంటాడు. కుళ్లుబోతు వెధవ. తాకితేనే సైకిలు విరిగిపోతుందా అమ్మా? ... చెల్లాయినిగూడ నా సైకిలు ముట్టుకోనియ్యను - అది నిన్న నా పలక విరగ్గొట్టేసింది. వద్దంటే ఏడుస్తుంది–చుప్పనాతి. ఉండు, నేనంతా నాన్నతో జెప్పి దాన్ని బాగా తన్నిస్తా!''

3

''ఈమెను తీసుకెళ్లు'' జైలరు ఆజ్ఞనిచ్చాడు. పోలీసు బంట్రోతు వెంట జైలు కాంపౌండులోనికి వెళ్లాను. యిరువైపులా కారాగారపు గదులు, బలిష్టమైన సంకెళ్లు, వానిలో బంధింపబడిన మానవులు – ఈశ్వర సృష్టిలోకెల్ల శ్రేష్టముగా పరిగణింపబడు మానవులు! ఒకరిద్దరుగాదు, వందలకొలదీగలరాజైల్లో. యీ ప్రపం

చంలో నేనొక్కతెనే కాదు అభాగ్యురాలిని- నాబోటివాళ్లు వేలు, లక్షలు గలరు.

దూరపు చూపుకే భయము గొల్పునట్లున్న ఒక చీకటికొట్టు ముందాగాడు పోలీసు. ఖైదీలు, పోలీసులు, చీకటికొట్లు- ఈ భీకరవాతావరణం గోపీని పూర్తిగా భయపెట్టేసినట్లుంది. వాడు గడగడ వణకుచు నా కాళ్లకు జుట్టుకొన్నాడు.

"ప్రకాశం!" అని ఎలుగెత్తి పిలిచాడు పోలీసు.

నేను నాలుగు వైపులా కలయజూచాను. ఎదురుగానున్నదే ఉరికంబము నెక్కుటకు సిద్ధముగానున్న ఖైదీలనుంచు గది. కరాళ మృత్యువదన గహ్వరము. మాట్లాడేశక్తి యుండినట్లైతే ఆ గది ప్రపంచంలోని వివిధ సాహిత్యములకంటె విపరీతము, విభిన్నము, భయంకరము అగు విషయముల నన్నింటినో వినిపించగలిగి యుండెడిది. ఈ గది గోడలలోని ప్రతి యిటుకయు ఖైదీల నిట్టూర్పుల వేడికే బాగా కాల్చబడినట్లున్నవి. గది నేలపై పడి యింకిపోయిన కన్నీటి బిందువులన్నీ ఒకచోట చేర్చినచో యీ ప్రపంచములో నాగరికులమని చెప్పుకొనువారిలో సగము మంది ఆ కన్నీటి మడుగులో ఈదులాడవచ్చునేమో! గదియందంతయు మృత్యుఛాయ గాఢముగా నలముకొనియున్నది. భీకర మృత్యునాట్య విన్యాసమునకు నాందియన్నట్లు ఆ చీకటికొట్టులో యినుప సంకెళ్లు బరువుగా ఘుల్, ఝుల్, ఝుల్ మన్నవి.

ప్రాణావశిష్టమైన ఒక యువక శరీరము ద్వారమువద్దకువచ్చి నిలువబడినది. అతడే ఆ యంధకూపములోపడియున్న "ప్రకాశం;" అంధకారమయమగు నాయనాథ జీవితప్రకాశము, తన బిడ్డలపాలిటి యాశా ప్రకాశము.

"ఐదు నిముషాలు మాత్రం వ్యవధి యివ్వబడ్డది. మాట్లాడుకోండి త్వరగా ... కాలం మించిపోతుంది."

ఖైదీకి నేనేమైన యిచ్చెదనేమోయను అనుమానంవల్ల నేను ఖైదీకి దూరముగా నుండవలయునని యాజ్ఞాపింపబడినది. తలెత్తి వారివైపుజూచాను. అబ్బ ... ఎంతటి హృదయ విదారకముగానున్నదా రూపము! గడ్డం, జుత్తు దట్టంగా పెరిగినవి. చెదరిన జుత్తు గడ్డంలో కలిసిపోయి యున్నది. కన్నులు బాగా లోతుకు దించుకుపోయ్యాయి. పూచిక పుడకతో పోటీపడుచున్నట్లున్నదా శరీరం. "బాబూ గోపీ! మీ నాన్నగారికి నమస్కరించమ్మా" అన్నాను. మూడేండ్ల బుడుతడు తల పూర్తిగా నేలకాన్చి తండ్రికి నమస్కరించాడు. నేనూ వారి పాదాలకు నమస్కరించాను. కాని వారి పాదాలను స్పృశించడానికూడ నోచుకోలేదీ అభాగ్య

కాలు. కమ్ముల తలుపున కావలివైపున మసక వెలుతురులో నిలువబడియున్నారు మావారు. వారి కళ్లల్లో నీళ్లు తొణుకుతున్నాయి. గద్గద స్వరంతో "సు ... శీ ... భ ... వ ...! యిదియే మనం కడసారి కలుసుకోవడం, నా కడసారి యాశీర్వాదం, మన కడపటి పలుకులు. అంతే ... ముగిసింది. రేపు తెల్లవారివచ్చి నా శవాన్ని తీసుకపో. నేనా విషయమై జైలరుతో చెప్పాను."

నెత్తిన చేతులుంచుకొని నేనల్లే చతికిలబడితిని.

"నాన్నా! యింటికిరావూ" నా హృదయంపై గొడ్డలితో గొట్టినట్లైనది - ఎంతటి యమాయకమైన కోరిక!

"బాబూ! నేను దేవుని దగ్గరికెళ్తున్నా, నువ్వు బుద్ధిగా చదువుకోనాన్నా-అమ్మను కష్టపెట్టకు గోపీ!"

యిక వారుకన్నీటి నాపులేకపొయ్యారు. జైలు కమ్ములను పిడికిళ్లలో బిగించి స్థాణువువలె నిలువబడ్డారు.

"నాన్నా! చెల్లాయి ఏడుస్తోంది. అది నాపలక విరగ్గొట్టేసింది. నాకింకో పలక తెచ్చీనాన్నా! - అదేంనాన్నా! నువ్వు ఏడుస్తున్నావు?"

వారు తలను రెండుచేతులతోను పట్టుకొని దీనంగా నావేపుజూచారు. బరువుగా నిట్టూరుస్తూ, "వింటున్నావుకదూ-; గోపీ పలక విరిగిపోయిందట-వాడికింకోపలకకొని పెట్టు."

నేనేమని బదులు పలికేది!-నా రెండు చెవులుశ్రవణశక్తిని గోల్పోయినట్లనిపించినది. కన్నులుపూర్తిగా చీకట్లు క్రమ్మివేసినవి.

"బాధపడకు సుశీ! మనస్సును గట్టిజేసికో. బిడ్డలను ప్రేమతో పెంచి, పోషించు. గోపీని బాగా చదివించు ... నాకాలం. గడచిపోయింది. ఇక బిడ్డలకు తల్లీ తండ్రీ అంతానీవే. నాకై చింతించవద్దు. జరగవలసిందెట్లానూ జరిగిపోయింది. బాధపడిమాత్రం చేయగలిగిందేముంది?"

"ఏమండీ!.. మరి...మరి"

నాకంఠం బొంగురు పోయింది. గుండెల్లోని రక్తంధారలు గట్టికళ్లలోప్రవహింపసాగింది. మరిమాట పెగల్లేదు.

"కానీయండి, ఐదునిముషాలు దాటిపోయింది" పోలీసు హెచ్చరించాడు.

"మంచిది, సుశీ! ... శలవు...నాకై గోపీనోమారు ముద్దు బెట్టుకో, చూచియైన ఆనందిస్తాను. సుశీ! ... సుశీ! ... భగవంతుడు నీకు ధైర్యమునిచ్చుగాక! వచ్చే జన్మలో కలసికొందాం...శలవ్-"

"ఊఁ చాలించండి ... పదవయ్యా, లోపలికెళ్లు" గద్దించాడు పోలీసు.